

కరకట్ట నిర్మాణానికి కరుణగిరి వద్ద చేపడుతున్న పనులు

# కరకట్ట షురూ..

- రూ.690.52 కోట్లతో ప్రారంభమైన పనులు
- గోళ్లపాడు యాక్సిడెంట్ టు ప్రకాశ్‌నగర్ చప్టా వరకు నిర్మాణం
- ఒక్కోవైపు 8.5 కిలోమీటర్లు.. మొత్తం 17 కిలోమీటర్లు
- గత ప్రభుత్వంలోనే మంజూరైన నిధులు
- మాజీమంత్రి పువ్వాడ అజయ్ కృషికి ప్రతిఫలం
- తీరనున్న మున్నేరు ప్రాంతప్రజల బాధలు

ఖమ్మం, ఏప్రిల్ 7 : ఖమ్మం నగరంలోని మున్నేరు తీరప్రాంత ప్రజల బాధలు తొలగిపోతున్నాయి. ప్రతియేటా పొంచిఉండే వరద ముప్పు నుంచి విముక్తి కలుగనుంది. తట్టాబుట్టా పట్టుకొని పునరావాస కేంద్రాలకు వెళ్లే దుస్థితి నుంచి బయటపడనున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి మున్నేరు ఒడ్డున నివసించే ప్రజల బాధలను పట్టించుకున్న నాధుడే లేడు. అలాంటిది ఖమ్మం మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ దూరదృష్టితో మున్నేరు ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. గత కేసీఆర్ ప్రభుత్వంలో మున్నేరు కరకట్టకు నిధులు మంజూరయ్యాయి. మాజీ మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్‌కుమార్ ఎన్నికలకు ముందు ఈ పనులకు శంకుస్థాపన చేసిన విషయం విదితమే. ఐతే ఎన్నికల కోడ్ రావడంతో టెండర్ ప్రక్రియ పూర్తికాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మున్నేరు కరకట్ట నిర్మాణానికి టెండర్ ప్రక్రియను పూర్తిచేయడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఆరునెలలలోపు కరకట్టను పూర్తిచేసేలా నీటి పారుదలశాఖ అధికారులు ప్రణాళికను సిద్ధం చేసి పనులు చేస్తున్నారు. కరకట్ట నిర్మాణానికి అవసరమయ్యే భూసేకరణ పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ పలుశాఖల అధికారులను ఆదేశించారు.

## కరకట్టకు రూ.690.52 కోట్లు మంజూరు

మాజీ మంత్రి పువ్వాడ అజయ్ సూచనతో మాజీ సీఎం కేసీఆర్ ఖమ్మం నగరంలోని మున్నేరు కరకట్ట నిర్మాణానికి రూ.690.52 కోట్లను కేటాయిస్తూ జీవో జారీ చేశారు. ఐతే ఎన్నికల కోడ్ రావడంతో టెండర్లు పిలవలేదు. ఆ తరువాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్లను పిలవడంతో పనులు ప్రారంభమయ్యాయి. నీటిపారుదలశాఖ అధికారులు రూ.690.52 కోట్లతో అంచనాలు రూపొందించారు. గోళ్లపాడ్ యాక్సిడెంట్ నుంచి ప్రకాశ్‌నగర్ చప్టా వరకు మున్నేరుకు ఇరువైపులా సుమారు 8.5 కిలోమీటర్లు పొడవున చొప్పున మొత్తం 17 కిలోమీటర్లు పొడవున కరకట్టను నిర్మించనున్నారు. కరకట్ట నిర్మాణానికి సంబంధించి కిందభాగంలో 15 మీటర్లు వెడల్పులో పైభాగం వచ్చేవరకు 9 నుంచి 12 మీటర్లు వెడల్పు ఉండేలా కరకట్టను నిర్మించనున్నారు. దీనికోసం నీటి పారుదలశాఖ అధికారులు పనులు చేపట్టారు. మున్నేరుకు ఇరువైపులా ఉన్న స్థలాన్ని చదును చేస్తున్నారు. అంతేకాకుండా ఆ కరకట్టపై వాకింగ్‌ట్రాక్, సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయడంతోపాటు పార్కుల మాదిరిగా సుందరీకరించబోతున్నారు. లకారం ట్యాంక్‌బండ్ ఏ విధంగా అయితే ఖమ్మానికి మణిహారంగా మారిందో మున్నేరు కరకట్ట కూడా త్వరలోనే మరో మణిహారం కానుంది. దీనివలన త్రీటౌన్ ప్రాంతప్రజల ఇబ్బందులు తొలగిపోతాయి.

## భూసేకరణ సాధ్యమయ్యేనా?

మున్నేరు నదికి కరకట్ట నిర్మాణ పనులు ప్రారంభంకావడంతో లోతట్టు ప్రాంత ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అనేక ఏండ్ల నుంచి మున్నేరు ఒడ్డున ఇండ్లు కట్టుకుని నివసిస్తున్న ప్రజలు తమ ఇండ్లను కూల్చుతారా అనే భయాందోళ వ్యక్తం చేస్తున్నారు. కాగా గత ప్రభుత్వం ఏ ఒక్కరి ఇంటిని కూల్చకుండా, ఏ ఒక్కరి స్థలాలకు నష్టం జరుగకుండా కరకట్ట నిర్మాణం జరుగుతుందని హామీ ఇచ్చింది. ఐతే ఇప్పుడు పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. అనేకమంది ప్రజలు కాల్వొడ్డు, బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, మోతీనగర్ తదితర ప్రాంతాల్లో ప్లాట్లు కొనుక్కొని ఉన్నారు. వీరు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరకట్ట నిర్మాణం వల్ల ముంపు సమస్య తొలగిపోతుంది కానీ తమకు నష్టం జరుగకుండా చూడాలని స్థానికులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## పెరగనున్న భూగర్భ జలాలు

మున్నేరు నది వరదల కారణంగా ఖమ్మం కార్పొరేషన్‌లోని పలు ప్రాంతాలతోపాటు ఖమ్మంరూరల్, ఖమ్మం అర్బన్, చింతకాని, ముదిగొండ, రఘునాథపాలెం మండలంలోని అనేక గ్రామాలు, ప్రాంతాలు ముంపునకు గురవుతున్నవి.. ప్రతి ఏడాది వరదలు రావడం, పునరావాస కేంద్రాలకు తరలడం నిత్యకృత్యంగా మారుతుంది. ఈ కరకట్ట నిర్మాణం వలన భవిష్యత్‌లో ముంపు సమస్య అనేది ఉండదు. దీంతోపాటు ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయి. ఖమ్మం కార్పొరేషన్‌కు తాగు నీటి కొరత ఉండదు. ఇప్పటికే ప్రకాశ్‌నగర్ వద్ద నిర్మించిన చెక్‌డ్యామ్ వలన త్రీటౌన్ ప్రాంత ప్రజలకు తాగునీటి సమస్య లేనట్టయింది. గతంతో పోల్చుకుంటే గత మూడు సంవత్సరాలుగా ఆ ప్రాంతంలో భూగర్భ జలాలకు లోటులేదని ఆప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు.



బీఆర్‌ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు

### మోసపూరిత హామీలతో
# అధికారం చేపట్టిన కాంగ్రెస్

- నాలుగు నెలల్లోనే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి
- తెలంగాణ ప్రజలు కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారు
- కష్టకాలంలో పార్టీకి అండగా ఉండేవాళ్లే అసలైన నాయకులు
- పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఎంపీ నామా నాగేశ్వరరావు

జూలూరుపాడు, ఏప్రిల్ 7 : మోసపూరిత హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో అనతికాలంలోనే తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు నామా నాగేశ్వరరావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలో ఆదివారం జరిగిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ రావుతో కలిసి ఆయన మాట్లాడారు. కష్టకాలంలో పార్టీకి నాయకులు అండగా ఉండాలని, రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీకే భవిష్యత్తు ఉందని, కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటామని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు తిరిగి కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారన్నారు. నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో తాగునీటికి, సాగునీటికి కటకట ఏర్పడిందని, రైతుల పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం సాగునీటిని అందించలేకపోతుందన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఎంపీగా కేంద్ర ప్రభుత్వంపై పోరాడి జిల్లాకు పలు రోడ్లను నేషనల్ హైవేలుగా మార్చానన్నారు. రైతు సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలను రద్దు చేసి రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలకాలంలో అమలుచేసిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వివరించి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు అవిశ్రాంతంగా కృషిచేయాలని కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తాళ్లూరి జీవన్‌రాజు, యల్లంకి సత్యనారాయణ, పోలుదాసు కృష్ణమూర్తి, లాకావత్ గిరిబాబు, చావా వెంకటరామారావు, భూక్యా కళావతి, భూక్యా నీల, దుద్దుకూరి నాగేశ్వరరావు, మోదుగు రామకృష్ణ, చేపలమడుగు రాంమూర్తి, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### భద్రాద్రిలో రేపటి నుంచి
# తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు

- 16న ఎదుర్కోలు ఉత్సవం
- 17న సీతారాముల కల్యాణం
- 18న మహా పట్టాభిషేకం
- రేపటి నుంచి 23వరకు నిత్య కల్యాణాలు నిలిపివేత

భద్రాచలం, ఏప్రిల్ 7 : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో వసంత పక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలు ఈ నెల 9వ తేదీ మంగళవారం ప్రారంభంకానున్నాయి. క్రోధి నామ సంవత్సరం ఉగాది రోజైన మంగళవారం ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 23వ తేదీ వరకు కొనసాగుతాయి. ఉగాదిరోజు సాయంత్రం పంచాంగ శ్రవణం, తిరువీధి సేవలు ప్రారంభమవుతాయి. మొదటిరోజు తిరువీధి సేవను కల్పవృక్ష వాహనంపై నిర్వహించనున్నారు. 9న ఉదయం 9గంటలకు ఉత్సవారంభం, ఋత్విక్ వరణం, రక్షాబంధనం, స్నపన తిరుమంజనం, సాయంత్రం పుట్టమన్నుతో పూజ, అంకురార్పణ చేయనున్నారు. 13న ధ్వజపట మండల లేఖనం, సార్వభౌమ సేవ, 14న ఉదయం గరుడ ధ్వజపట లేఖనం, సాయంత్రం గరుడ ధ్వజ పటావిష్కరణ, గరుడ ధ్వజాధివాసం15న ఉదయం అగ్ని ప్రతిష్ట, ధ్వజారోహణం, రాత్రికి భేరీ తాడనం, దేవతాహ్వానం, బలి సమర్పణ, హనుమద్వాహన సేవ, 16న రాతికి గరుడ వాహన సేవ, ఎదుర్కోలు ఉత్సవం, 17న శ్రీరామనవమిని పురస్కరించుకొని మిథిలా స్టేడియంలో సీతారాముల కల్యాణం, సాయంత్రం శ్రీరామ పునర్వసు దీక్షలు ప్రారంభంకానున్నాయి. 18న మహా పట్టాభిషేకం, 19న సదస్యం, హంసవాహన సేవ, 20న తెప్పోత్సవం, చోరోత్సవం, 21న రాత్రికి ఊంజల్ సేవ, 22న వసంతోత్సవం, సూర్యప్రభ వాహన సేవ, 23న చక్రతీర్థం, శేషవాహన సేవ, ధ్వజావరోహణం, దేవతోద్వాసనం, ద్వాదశ ప్రదక్షిణలు, ద్వాదశారాధనలు, పుష్పయాగం నిర్వహిస్తారు. దీంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి అవుతాయి.



ఉత్సవాలకు స్వాగత ద్వారం ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

## రేపటినుంచి నిత్య కల్యాణాలు నిలిపివేత

ఉగాది రోజు నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం నుంచి 23వరకు నిత్య కల్యాణాలను నిలిపివేయనున్నారు. 24 నుండి నిత్య కల్యాణాలు పునః ప్రారంభంకానున్నాయి. ఈ రోజు నుంచి బ్రహ్మోత్సవాలు ముగిసేంత వరకు ప్రతిరోజు రామయ్యకు తాతాగుడి సెంటర్ వరకు తిరువీధి సేవను నిర్వహిస్తారు. అలాగే 9 నుంచి 23 వరకు దర్బార్ సేవలు, 9నుంచి మే 1 వరకు పవళింపు సేవను నిలిపివేయనున్నారు. మే 2న స్వామివారికి నూతన పర్యంకోత్సవం, పవళింపు సేవలు ప్రారంభమవుతాయి. శ్రీరామ నవమి రోజున(17న) ప్రారంభమైన శ్రీరామ పునర్వసు దీక్షలు మే 13న దీక్షా విరమణ, అదేరోజు రాత్రికి అంగరంగ వైభవంగా రథోత్సవం నిర్వహించనున్నారు. అలాగే 14న పుష్యమి నక్షత్రం సందర్భంగా శ్రీరామ దీక్షాపరులతో పట్టాభిషేకం జరుపనున్నారు.

### ఎమ్మెల్యే వెంకట్రావుది
# సిగ్గుమాలిన చర్య



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

- పదవికి వెంటనే రాజీనామా చేయాలి
- పార్టీ ఫిరాయింపుపై హైకోర్టులో కేసు వేస్తాం
- ఎమ్మెల్సీ తాతా మధు

భద్రాచలం, ఏప్రిల్ 7 : బీఆర్‌ఎస్ నాయకుల కష్టం, ఓటర్ల ఆశీస్సులతో బీఆర్‌ఎస్ పార్టీ తరపున భద్రాచలం ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ పార్టీలో చేరడం సిగ్గుమాలిన చర్య అని ఆ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. ఆదివారం భద్రాచలం పట్టణంలోని రెడ్ల సత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల విశ్వాసాన్ని, బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల కష్టాన్ని వమ్ము చేసిన వెంకట్రావుకు ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. భద్రాచలం నియోజకవర్గ ప్రజల తీర్పును అవహేళన చేసినట్లయిందన్నారు. తుక్కుగూడలో జాతీయ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మ్యానిఫెస్టోలో రాజీనామా చేయకుండా మరో పార్టీలో చేరికతో ఆటోమెటిక్‌గా అనర్హత వేటుపడేలా రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లో సవరణ తీసుకువస్తామని హామీ ఇచ్చి, 24 గంటలు గడవకముందే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేను తన పార్టీలో చేర్చుకోవడం కాంగ్రెస్ ద్వంద‌నీతికి నిదర్శనమన్నారు. శాసనసభ స్పీకర్ తెల్లం వెంకట్రావు శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఎమ్మెల్యేగా అనర్హుడిగా గుర్తించాలన్నారు. లేనిపక్షంలో తమ పార్టీ అధినాయకత్వం సూచనల మేరకు ఈ విషయంపై హైకోర్టులో పిల్ వేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును కాదని వెళ్లినంత మాత్రాన బీఆర్‌ఎస్ పార్టీకి వచ్చే నష్టం ఏమీలేదన్నారు. తన వ్యక్తిగత స్వలాభం కోసం వేలాది మంది ప్రజల ఆశలను అడియాశలను చేసిన వెంకట్రావుకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే మీ ఇళ్లకు వస్తే పార్టీ ఫిరాయింపుపై నిలదీయాలని పిలుపునిచ్చారు. రాబోయే కాలంలో నియోజకవర్గవ్యాప్తంగా పార్టీ కోఆర్డినేషన్ కమిటీలను వేయనున్నట్లు, అన్ని మండల పార్టీ పదవులు మారుస్తామన్నారు. కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీగా అభ్యర్థిగా పోటీచేస్తున్న మాలోత్ కవితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వెంకట్రావుతోపాటు కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఈ రోజు నుంచి తమ పార్టీతో ఎటువంటి సంబంధం లేదని, వారందరిని బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి మానె రామకృష్ణ, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, దుమ్ముగూడెం మండల అధ్యక్షుడు అన్నెం సత్యాలు, తాండ్ర వెంకట రమణారావు, వాసురాజు, ఆకోజు సునీల్‌కుమార్, కోలా రాజు, లంకపల్లి విశ్వనాథ్, కాపుల సూరిబాబు, కావూరి సీతామహాలక్ష్మి, నరసమ్మ, శిలువ కుమార్, ప్రభు, డానియేల్, ప్రదీప్, గఫార్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే తెల్లంపై అనర్హత వేటు వేయాలి : రేగా



మణుగూరుటౌన్, ఏప్రిల్ 7 : భద్రాచలం ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్ పార్టీ టికెట్‌పై గెలిచిన తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకట్రావుపై లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తామని, వెంకట్రావు ఎమ్మెల్యేగా రాజీనామా చేసి పార్టీ మారాలని లేనిపక్షంలో స్పీకర్ అనర్హత వేటు వేయాలన్నారు. స్పీకర్ చర్యలు తీసుకోకుంటే న్యాయపరంగా కోర్టులో తేల్చుకుంటామని అన్నారు. ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలో చేరుతున్న ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టండని పిలుపునిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిని ఇప్పుడు దేనితో కొట్టాలని రేగా ప్రశ్నించారు.

# సాగర్ నుంచి నీటి విడుదల నిలిపివేత

### 18 అడుగులకు చేరిన పాలేరు నీటిమట్టం

కూసుమంచి, ఏప్రిల్ 7 : మిషన్ భగీరథ ద్వారా తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి గత సోమవారం విడుదల చేసిన నీటిని ఇరిగేషన్ అధికారులు ఆదివారం నిలిపివేశారు. పాలేరు జలాశయం డెడ్ స్టోరేజికి చేరుకోవడంతో ఐదు జిల్లాలకు తాగునీటి అవసరాల కోసం సాగర్ నుంచి వదిలిన నీరు గురువారం పాలేరు రిజర్వార్‌కు చేరుకున్నాయి. సాగర్‌లో ఆదివారం నీటిని నిలుపు చేసినా ఇంకా నాలుగు రోజులపాటు పాలేరు ఇన్‌ఫాల్ ద్వారా నీరు పాలేరుకు వచ్చి చేరుతుంది. ఆదివారం సాయంత్రానికి నీటిమట్టం 18 అడుగులకు చేరుకుంది. ఇంకా కాలువలో ఉన్న నీరు పాలేరుకు వచ్చే అవకాశం ఉన్నందున నీటిమట్టం మరో అడుగు పెరిగే అవకాశం ఉంది. శనివారం రాత్రి వరకు 5,200 క్యూసెక్కులు వచ్చిన నీరు తగ్గుతూ ఆదివారం సాయంత్రానికి 3,642 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. ఇదిక్రమంగా తగ్గుతూ సాగర్ డ్యాం నుంచి పాలేరు వరకు గల కాలవులో నీరు మరో మూడ్రోజులపాటు రిజర్వాయర్‌కు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఖమ్మం కార్పొరేషన్ తాగునీటి అవసరాల కోసం వదిలిన 500 కూసెక్కుల నీటిని కూడా ఇరిగేషన్ అధికారులు నిలిపివేశారు.



# రైతులే.. కూలీలయ్యారు!

పెనుబల్లి, ఏప్రిల్ 7 : వ్యవసాయమే వారి జీవనాధారం. కుటుంబ సభ్యులతో నిత్యం సాగు భూములతోనే మమేకం. వానకాలం, యాసంగి రెండు కాలాల్లో నిరంతరం శ్రమిస్తూ రెండు పంటలు పండించుకునే రైతాంగం. పొద్దంతా సాగు పనుల్లో బిజీబిజీగా ఉంటూ తాము పని చేస్తూ.. పది మందికి పనులు కల్పించేవారు పెనుబల్లి మండల రైతులు. కానీ.. పరిస్థితి మారింది. యాసంగి సాగుకు అవసరమయ్యే నీళ్లు చెరువులు, బావులు, బోర్లలో లేకపోవడంతో పంటలు పండే పరిస్థితి లేదు. ఉన్న నీటిని నమ్ముకొని పంటలు వేస్తే నీరందక ఎండిపోవడం.. కొందరు రైతులు నీళ్లు లేక సాగు జోలికి వెళ్లకపోవడం.. మరికొందరు పంట భూములను వదిలేసి ఉపాధి కూలీలుగా మారి పనులు చేసుకుంటున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎర్రటెండలో మలమలమాడుతూ పొట్టకూటి కోసం నానా కష్టాలు పడుతున్నారు. మండలవ్యాప్తంగా ఉన్న 33 పంచాయతీల్లో రోజుకు 150 నుంచి 200 మంది రైతులు ఉపాధి కూలీలుగా పేర్లు నమోదవుతున్నారు.

## ఎన్నెస్పీ ఆయకట్టు రైతులే అధికం..

అయితే సాగర్ కాలువ కింద ఉన్న ఆయకట్టు గ్రామాలు కర్రాలపాడు, తాళ్లపెంట, టేకులపల్లి, కుప్పెనకుంట్ల, తుమ్మలపల్లి, పాత కుప్పెనకుంట్ల, బయ్యన్నగూడెం తదితర గ్రామాల రైతులు కూడా కూలీలుగా మారి ఉపాధి పనులు చేస్తున్నారు. ఏటా మాదిరిగా ఈ సంవత్సరం కూడా ఎన్నెస్పీ నీళ్లు వచ్చినట్లైతే తమకున్న భూములతోపాటు మరి కొంత భూమిని కౌలుకు తీసుకొని నిత్యం సాగు పనుల్లో బిజీగా ఉండేవారు. ప్రస్తుతానికి ఎన్నెస్పీ ఆయకట్టుకు నీటి పారకం లేకపోవడంతో పంటలు పండకపోవడంతో కుటుంబాలను పోషించుకునేందుకు కూలీలుగా మారారు. తమకు ఇలాంటి రోజులు వస్తాయని కలలో కూడా అనుకోలేదని, ఇది కాలం తెచ్చిన కరువో, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువో అని రైతులు గొణుక్కుంటున్నారు.



ఉపాధి పనుల్లో మహిళా కూలీలు

- యాసంగిలో సాగుకు నీళ్లు లేక కూలీలుగా మారిన రైతులు
- మండుటెండలో కుటుంబ పోషణకు ఉపాధిహామీ పనులు
- 33 పంచాయతీల్లో రోజుకు 150 నుంచి 200 మంది కూలీలుగా నమోదు



ట్రాక్టర్‌కు మట్టి ఎత్తుతున్న కూలీలు

### సాగు లేక కూలి పనే దిక్కాయె



ఎన్నెస్పీ నీళ్లు రావడంతో ప్రతి సంవత్సరం సొంత పొలంతోపాటు కౌలుకు 5 నుంచి 10 ఎకరాలు తీసుకొని సాగు చేసేవాడిని. కానీ.. నేడు ఎన్నెస్పీ కాలువల్లో నీళ్లు రావడం లేదు. పంటల సాగుపై ఆశలు వదులుకున్నాం. కుటుంబ పోషణ కోసం ఉపాధి పనులు చేసుకుంటున్నాం.

-జంగా వెంకటేశ్వరరావు, రైతు

### సాగు లేదు.. పనులు లేవు



సాగు పనులు లేకపోవడంతో ఉపాధి పనులకు వెళ్తున్నాం. సాగు పనులు ఉన్నప్పుడు నలుగురికి పనులు చూపించేవాళ్లం. ఇప్పుడు సాగుకు నీళ్లు లేకపోవడంతో మాకే కాకుండా వ్యవసాయ పనులపై ఆధారపడిన కూలీలకు కూడా ఉపాధి పనులే దిక్కయ్యాయి.

-బాజిన్ని పిచ్చయ్యరావు, కొప్పుల నాగేశ్వరరావు, టేకులపల్లి

### ఉపాధి పనే దిక్కయ్యింది..



గతంలో నాట్లు, కలుపు, మిర్చి కోతల తర్వాత ఉపాధి పనులకు వెళ్లేవాళ్లం. వరి పొలాల్లో పనులకు వెళితే రూ. 300 నుంచి రూ. 400 కూలి పడేది. మిర్చి పనులకు వెళితే కేజీల లెక్క రూ.500 నుంచి రూ.700 కూలి పడేది. ఇప్పుడు ఆ పని లేకపోవడంతో ఉపాధి పనికి వెళితే రూ.170 కూలి పడుతుంది. ఇప్పుడు ఈ పని తప్ప వేరే పని లేదు.

-మిడియం ముత్తమ్మ, తాళ్లపెంట